www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 16 డిసెంబరు 2022
5
ఏలూరు



విద్యుత్‌ను ఆదా చేయాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

విద్యుత్ పొదుపు అమలు గురించి జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు మండలంలోని సింగరాయపాలెంలో ఉన్న గ్రోవెల్ ప్రాసెస్సర్ ఫ్యాక్టరీని గురువారం జిల్లా పరిశ్రమల శాఖ కేంద్రం అధికారులు సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ ఇంధన శాఖ రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల14 నుంచి 20వ తేదీ వరకు ఎనర్జీ కన్జర్వేషన్ వీక్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సింగరాయపాలెం గ్రోవెల్ ప్రాసెస్సర్‌ను జిల్లా పరిశ్రమల శాఖ కేంద్రం జనరల్ మేనేజర్ పి.యేసుదాస్, ఇండస్ట్రియల్ ప్రమోషన్ అధికారి యువరాజ కిషోర్‌లు సందర్శించారు. ఎపి సీడ్కో సేవలను ఉపయోగించుకొని రెగ్యులర్‌గా ఇన్వెస్ట్ గ్రేడ్ ఎనర్జీ ఆడిట్‌ను చేయించుకోవడం ద్వారా విద్యుత్ వినియోగాన్ని ఆదా చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్టరీ ఎలక్ట్రికల్ మేనేజర్ భాస్కర్, హెచ్‌ఆర్ అసిస్టెంట్ మేనేజర్ ఎం.ప్రతిమ పాల్గొన్నారు.

భారమంతా వారిపైనే..!

పని ఒత్తిడితో విఆర్‌ఒలు సతమతం - రీసర్వే వ్యయం కూడా వారిదే - అదనపు పనులతో మానసిక ఒత్తిడి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్




పని ఒత్తిడితో రెవెన్యూ శాఖలో విఆర్‌ఒలు సతమతమవుతున్నారు. ఏ ఒక్క విఆర్‌ఒను కదిలించినా ఒక్కొక్కరు ఒక్కో గాథ ప్రస్తావిస్తున్నారు. విఆర్‌ఒలకు వంద రోజుల్లో రీ సర్వేను పూర్తి చేయాలని లక్ష్యాలను నిర్దేశించడంతో మరింత సతమతమవుతున్నారు. దానికితోడు ఈ రీసర్వేకు సంబంధించిన వ్యయమంతా వారే పెట్టుకునేలా ఆదేశాలు జారీ చేస్తున్నారు. గ్రామస్థాయిలో విధులు నిర్వహించే విఆర్‌ఒలకు ఇటీవల పనిభారం అధికమైంది. ఎప్పుడు ఏ బాధ్యత మీద పడుతుందోనన్న ఆందోళన వెంటాడుతోంది. పనిభారం తగ్గించాలంటూ చివరకు విఆర్‌ఒలు నిరసనకు దిగే దుస్థితి ఏర్పడింది. విధులతో పాటు ఆర్థిక ఇబ్బందులు చుట్టుముడుతున్నాయి. మండల స్థాయి నుంచి, జిల్లా అధికారుల వరకూ వినతిపత్రాలను సమర్పిస్తూనే ఉన్నారు. రాష్ట్రస్థాయిలోనూ సమస్యలు చెప్పుకున్నా ఫలితం దక్కడం లేదు. ఫలితంగా ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా విఆర్‌ఒలు నిరసన తెలిపారు. అయినా ఉన్నతాధికారుల్లో చలనం లేదు. ప్రభుత్వం ఆదేశించే విధులను గంటల వ్యవధిలోనే పూర్తి చేయాలంటూ ఉన్నతాధికారుల నుంచి ఒత్తిళ్లు ఎదురవుతున్నాయి. సచివాలయాలు ఏర్పాటైనా గ్రామస్థాయిలో ఉండే విఆర్‌ఒలకు తిప్పలు తప్పడం లేదు. ప్రధానంగా వెబ్‌ల్యాండ్ సమస్యలు పరిష్కరించాల్సి వస్తోంది. దానికోసం క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించాలి. పట్టాదారు పాస్ పుస్తకం జారీ చేయాలంటే గతంలో నెలన్నర రోజుల వ్యవధి ఉండేది. ఇప్పుడది 21 రోజులకు కుదించారు. అప్పటిలోగా పట్టాదారు పుస్తకం మంజూరు చేయకపోతే విఆర్‌ఒలనే బాధ్యులను చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించి క్లియరెన్స్ ఇస్తేనే పట్టాదారు పుస్తకం మంజూరవుతోంది.

వ్యయమంతా వీరిపైనే..

జగనన్న భూరక్ష పథకంలో గ్రామాల్లో రీ సర్వే నిర్వహిస్తోంది. అందుకోసం ఇతర ప్రాంతాల నుంచి సిబ్బందిని నియమిస్తున్నారు. వారికి అవసరమైన సౌకర్యాలను కల్పించే బాధ్యత విఆర్‌ఒలపై పడుతోంది. మరోవైపు రీ సర్వేకు అయ్యే వ్యయాన్ని వారే భరిస్తున్నారు. గ్రామస్థాయిలో ప్రాథమికంగా నిర్వహించిన సర్వేకు గరిష్ఠంగా రూ.50 వేల వరకూ సొంత సొమ్ములు వెచ్చించారు. పూర్తిస్థాయిలో సర్వే నిర్వహిస్తే మరింత ఆర్థిక భారాన్ని మోయాల్సి ఉంటుంది. రీ సర్వే నిర్ణీత వ్యవధిలోనే పూర్తి చేయాలన్న ఒత్తిడి అధికమవుతోంది. ప్రభుత్వంమాత్రం ఇప్పటి వరకూ పైసా బిల్లు మంజూరు చేయలేదు. అంతా రెవెన్యూ ఉద్యోగులే భరిస్తున్నారు. రీసర్వేలో భాగంగా సర్వేయర్లతో క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సి వస్తోంది. ఒకవైపు పనిఒత్తిడి ఎదురవుతుంటే మరోవైపు ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నాయి.

ధాన్యం కొనుగోలు బాధ్యతా వీరిదే..

ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో ఎన్నడూ లేని విధంగా విఆర్‌ఒలను కస్టోడియన్‌లుగా నియమించింది. రైస్ మిల్లుల వద్ద కస్టోడియన్ ఆఫీసర్ బాధ్యతలను వారు నిర్వహిస్తున్నారు. ఇటీవల ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా సాగడం లేదు. తేమ శాతంలో తేడా ఉంటోంది. రైతు భరోసా కేంద్రాలకు, రైస్ మిల్లుల వద్ద తేమ శాతానికి పొంతన కుదరడం లేదు. దాంతో విఆర్‌ఒలే కస్టోడియన్‌లుగా సమస్యను పరిష్కరించాల్సి వస్తోంది. నిత్యం కొనుగోలు బాధ్యతను నిర్వహిస్తూ ఒత్తిడికి గురవుతున్నారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి తప్పులు జరిగితే కస్టోడియన్ ఆఫీసర్లను బాధ్యులను చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చస్తున్నారు. ఇలాంటి హెచ్చరికలతో విఆర్‌ఒలు బెంబేలెత్తిపోతున్నారు. రెవెన్యూ శాఖకు సంబంధం లేని బాధ్యతలు ఇప్పుడు విఆర్‌ఒలు నిర్వహించాల్సి వస్తోంది. జగనన్న ఇళ్ల స్థలాలకు సంబంధించి ఇకైవైసి నిర్వహించడంలో విఆర్‌ఒలే ప్రధాన భూమిక పోషిస్తున్నారు. కొంతకాలంపాటు దీనిలోనే నిమగ్నమయ్యారు. అంతలోనే లబ్ధిదారులు ఇళ్ల ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలంటూ ఆదేశాలొస్తున్నాయి. ఆ బాధ్యత కూడా వారిపైనే పడుతోంది. వ్యవసాయ గణాంకాల విధులను నిర్వహిస్తున్నారు. ఇ-క్రాప్ నమోదుతో పాటు, వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించి గణంకాలు సిద్ధం చేయాల్సి వస్తోంది. ఇలాంటి బాధ్యతలతో పాటు ప్రతినిత్యం నిర్వహించాల్సిన విధులు అనేకం ఉంటున్నాయి. కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, ఒబిసి, ఇడబ్ల్యుఎస్, ఎఫ్‌ఎంసి, వ్యవసాయ ధృవీకరణ పత్రాలు మంజూరు చేయాల్సి ఉంటుంది. వీటికితోడు ప్రకృతి వైపరీత్యాలు ఎదురైతే క్షేత్రస్థాయిలో బాధ్యతంతా వారిపైనే పడుతోంది. జాతర సమయాల్లో దేవాలయాల వద్ద విఆర్‌ఒలను నియమిస్తున్నారు. దీనికితోడు ప్రతీ సోమ, గురువారాల్లో సమావేశాలు ఉంటున్నాయి. ఎన్నికల విధులు తప్పడం లేదు. స్పందనలో సెల్ఫీ ఫొటో తప్పనిసరి చేశారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైతే పరిరక్షించే బాధ్యత కూడా వీరిదే. ఇలా చెప్పుకుంటే పోతే లెక్కకు మిక్కిలి విధులతో మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. రాష్ట్రస్థాయి అధికారులకు సైతం సమస్యలు చెప్పుకున్నా పరిష్కారం లభించడం లేదు.



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

స్ఫూర్తిదాయకులు పొట్టి శ్రీరాములు

ప్రజాశక్తి - ఏలూరు

అమర జీవి పొట్టి శ్రీరాములు తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశ మందిరంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి సభ వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబుతో కలిసి పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద కలెక్టర్ జ్యోతిప్రజ్వలన చేసి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగు మాట్లాడే ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కోరుతూ పొట్టి శ్రీరాములు చేసిన పోరాటం నిరుపమానమైనదన్నారు. గాంధేయ మార్గంలో 56 రోజులపాటు నిరాహారదీక్ష చేసి అమరులయ్యారన్నారు. వారి ప్రాణత్యాగాన్ని తెలుగుజాతి ఎన్నటికీ మరువదన్నారు. ఆయన ఆశయాలు తెలుగువారందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ కె.పెంచల కిషోర్, జెడ్‌పి సిఇఒ రవికుమార్, బిసి కార్పొరేషన్ ఇడి ఎన్.పుష్పలత, బిసి వెల్ఫేర్ అధికారి ఆర్‌వి.నాగరాణి, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, సోషల్ వెల్ఫేర్ జెడి మధుసూదనరావు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనరు ఎస్‌కె.షాహిద్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి సత్యనారాయణ, అధికారులు పాల్గొని పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళు లర్పించారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించి, రైతుల ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం అధ్యక్షత వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 29వ మహాసభ విజయవంతానికి కృషిచేసిన ఆహ్వానం సంఘ సభ్యులకు, వ్యవసాయ కార్మికులకు, పట్టణ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. వ్యవసాయ కార్మికుల స్థితిగతులు మారాలంటే ప్రతి కుటుంబానికి రెండు ఎకరాలు సాగుభూమి పంచాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగంలో యాంత్రికరణ పెరగడంతో ఉపాధి లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం ఉపాధి చూపించాలన్నారు. ఈ సమస్యలపై రానున్న మూడేళ్లలో పోరాటాలు నిర్వహిస్తామని, మహాసభ కూడా తీర్మానం చేసిందని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటికే రైతుల వద్ద వేల టన్నుల ధాన్యం ఉందని, అకాల వర్షాలతో ధాన్యం తడిసి రైతన్నలు ఆందోళనలో ఉన్నారని ప్రభుత్వం స్పందించి వెంటనే ప్రభుత్వం ఆ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ కార్మికులు సమస్యలపై దశలవారి ఉద్యమాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తామ ముత్యాలమ్మ, యాగంటి సీత, తుమ్మల సత్యనారాయణ, రాజమండ్రి దానియేలు, ఎం.సుధారాణి, అందుగుల ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

చేనేత రంగానికి జిఎస్‌టి మినహాయించాలి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

చేనేత రంగానికి జిఎస్‌టి మినహాయింపు ఇవ్వాలని, మగ్గం నేస్తున్న ప్రతి చేనేత కార్మికుని కుటుంబానికి నేతన్న నేస్తం పథకం వర్తింపజేయాలని ఎపి చేనేత కార్మికసంఘం జిల్లా కార్యదర్శి పిచ్చుక ఆదిశేషు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏలూరు మండలం శనివారపుపేట వీవర్స్ కాలనీలో చేనేత కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు ప్రతినిధి బృందం వినతిని అందించింది. ఈ సందర్భంగా ఆదిశేషు మాట్లాడుతూ దేశంలో వ్యవసాయం తర్వాత అత్యధిక మందికి ఉపాధి కల్పించే రంగం చేనేత రంగమని, కానీ నేడు పాలకుల కార్పొరేట్ విధానాల వల్ల తీవ్రమైన సంక్షోభంలో చిక్కుకుందన్నారు. ఫలితంగా చేనేత కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడుతున్నారని, ఆకలి చావులు, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. బిజెపి ప్రభుత్వం చేనేతపై జిఎస్‌టి విధించడంతో మరింత సంక్షోభంలోకి నెట్టబడిందన్నారు. రాష్ట్రంలోని సిఎం జగన్ ప్రభుత్వం రాష్ట్రంలోని చేనేత కార్మికులందరికీ నేతన్న నేస్తం పథకాన్ని వర్తింపజేస్తామని చెప్పి, 98 వేల చేనేత కార్మికుల కుటుంబాల్లో 17 వేల మందికి కోత విధించారన్నారు. చేనేత రంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు, కేంద్ర ప్రభుత్వం రూ.పదివేల కోట్ల కేటాయించి చేనేత రంగాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు మాడా వెంకటేశ్వరరావు, గుత్తి పోతురాజు, పిచ్చుక నాగేశ్వరరావు, నార్ని విజయలక్ష్మి పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న ఆయిల్‌పామ్ కార్మికులు

ఆయిల్‌పామ్ కార్మికునికి న్యాయం చేయాలని ధర్నా

ప్రజాశక్తి - చింతలపూడి

పామాయిల్ గెలలు నరుకుతూ చెట్టుపై నుంచి జారి తీవ్రంగా గాయపడిన జరపల సర్వేశ్వరరావు కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ మండలంలోని సీతానగరంలోని గోద్రేజ్ ఫ్యాక్టరీ ఎదుట కార్మికులు, బంధువులు బుధవారం పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. ఆసుపత్రి పాలైన సర్వేశ్వరరావు వైద్య ఖర్చులకు ఫ్యాక్టరీ యాజమాన్యం రూ.15 లక్షల పరిహారం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ పామాయిల్ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తుమ్మల సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని రెండోమైలు గ్రామంలో సర్వేశ్వరరావు(35) పామాయిల్ గెలలు నరుకుతుండగా ఓ గెల మీదపడి వెన్నుముక విరిగిందని, విజయవాడ ఆస్పత్రిలో వైద్యం చేయించారని, రూ.నాలుగు లక్షల ఖర్చయినా నయం కాలేదన్నారు. ఇంకా మరికొంత డబ్బు అవసరమవుతుందని, ఫ్యాక్టరీ యాజమాన్యం స్పందించి పరిహారం ఇవ్వాలని కోరారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ధర్నా చేపట్టారు. దీంతో ఫ్యాక్టరీ మేనేజర్ ఆందోళనకారులతో పలుమార్లు చర్చించారు. అయితే ఫ్యాక్టరీ సిఇఒ అందుబాటులో లేకపోవడంతో శుక్రవారం ఆయన వచ్చిన తర్వాత చర్చించి పరిహారం ఇస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. సర్వేశ్వరరావు కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వని పక్షంలో జిల్లావ్యాప్తంగా ఉన్న కార్మికులతో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మేకల శ్రీను, పామాయిల్ కార్మికులు శ్రీరామ్మూర్తి, చక్రవర్తి, సర్వేశ్వరావు, కుటుంబ సభ్యులు రేచర్ల, పామాయిల్ కార్మికులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంఎల్‌ఎ అబ్బయ్యచౌదరి

ఉత్సాహంగా శాటిలైట్ జర్నలిస్టుల క్రికెట్ టోర్నమెంట్

ప్రారంభించిన ఎంఎల్‌ఎ అబ్బయ్యచౌదరి, జెసి అరుణ్‌బాబు

ప్రజాశక్తి - ఏలూరు

శాటిలైట్ న్యూస్ ఛానల్స్ స్టాఫ్ రిపోర్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శాటిలైట్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఏలూరు ఆశ్రం వైద్య కళాశాల క్రికెట్ మైదానంలో ఉత్సాహంగా నిర్వహించారు. గురువారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా శాటిలైట్ ఛానల్స్ స్టాఫ్ రిపోర్టర్ల ఆధ్వర్యంలో నిర్వహించిన శాటిలైట్ ప్రీమియర్ లీగ్‌ను దెందులూరు ఎంఎల్‌ఎ కొఠారు అబ్బయ్య చౌదరి, జిల్లా జాయింట్ కలెక్టర్ పి.అరుణ్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా దెందులూరు ఎంఎల్‌ఎ కొఠారు అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ శాటిలైట్ ఛానల్స్ పాత్రికేయ బృందం చక్కటి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడా స్ఫూర్తి ప్రదర్శించి టోర్నమెంట్‌లో విజేతలుగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. నిత్యం వార్తా సేకరణలో పనిచేసే పాత్రికేయులు కొంత ఆటవిడుపుగా ఇటువంటి టోర్నమెంట్లు నిర్వహించడం ద్వారా ఆహ్లాదాన్ని పొందవచ్చన్నారు. ఈ పోటీల్లో శాటిలైట్ ఛానల్స్ స్టాఫ్ రిపోర్టర్స్, పశ్చిమ గోదావరి జిల్లా రిపోర్టర్స్, ఏలూరు టౌన్ రిపోర్టర్స్, జిల్లా కెమెరామెన్లు నాలుగు టీంలుగా టోర్నమెంట్‌లో పాల్గొంటున్న బృందాలకు ఆయన అభినందనలు తెలిపారు. జిల్లా జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు మాట్లాడుతూ ప్రతిరోజు తమ వృత్తిలో ఎంతో బిజీగా ఉండే పాత్రికేయులకు ఇటువంటి క్రికెట్ టోర్నమెంట్లలో పాల్గొనడం ద్వారా కొంత ఉపసమనం, స్నేహపూరిత వాతావరణం పొందవచ్చన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా అందరూ ఒకచోట కలిసి తమ అనుభవాలను పంచుకొనే అవకాశం ఉందన్నారు. అందరూ బాగా ఆడుతున్నారని, వారందరికి విజయం చేకూరాలని ఆయన ఆకాంక్షించారు.

టోర్నమెంట్ విజేతగా ఏలూరు టీమ్

శాటిలైట్ ప్రీమియర్ లీగ్‌లో ఫైనల్ మ్యాచ్ పశ్చిమగోదావరి జిల్లా నియోజకవర్గ రిపోర్టర్లకు, ఏలూరు జిల్లా నియోజకవర్గ రిపోర్టర్లకు మధ్య జరిగింది. ఈ పోరులో ఏలూరు జిల్లా నియోజకవర్గ స్థాయి రిపోర్టర్లు విన్నర్స్‌గా నిలిచి కప్పు గెలుచుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లా నియోజకవర్గ స్థాయి రిపోర్టర్లు రన్నర్‌గా నిలవగా, విజేతలకు ఆశ్రం వైద్య కళాశాల సిఇఒ హనుమంతరావు కప్పు అందించారు. అసోసియేషన్ అధ్యక్షులు అప్పలభక్తుల భార్గవ్, కార్యదర్శి ఆలపాటి మురళీ, ఇతర కార్యవర్గం, శాటిలైట్ ఛానల్స్ స్టాఫ్ రిపోర్టర్లు, కెమెరామెన్లు, రిపోర్టర్లు పాల్గొన్నారు.

కల్లాల్లోనే ధాన్యం కొనుగోలు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రైతులు పండించిన ధాన్యాన్ని కల్లాల్లోనే కొనుగోలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పవరుపేటలో పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల కష్టాన్ని దళారులు, మిల్లర్లు దోచుకోకుండా రైతులకే దక్కేలా ధాన్యం కొనుగోలు విధానాన్ని ప్రవేశపెట్టామని రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా ప్రకటించిందని, ఆచరణలో దీనికి విరుద్ధంగా సాగుతోందన్నారు. జిల్లాలో 3.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగా నేటికి సగం కూడా పూర్తికాలేదన్నారు. కొనుగోలు చేసిన 21 రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని చెప్పారని, రూ.200 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేయగా ఇంత వరకూ రూ.68 కోట్లు మాత్రమే జమ చేశారన్నారు. నెల రోజులు దాటినా నేటికీ డబ్బులు చెల్లించలేదన్నారు. దీంతో కొనుగోలు ప్రక్రియ రైతులకు దినదినగండంగా మారిందన్నారు. ప్రభుత్వం చెప్పిన లక్ష్యాలకు విరుద్ధంగా రైతుల కష్టం దక్కడం మాటేలా ఉన్న ప్రస్తుత ప్రక్రియ వల్ల పెట్టుబడులు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. ఒకపక్క క్షణక్షణానికి మారిపోతున్న వాతావరణం, మరోపక్క ప్రభుత్వ నిబంధనల వల్ల రైతులు తమ పంటను కాపాడుకోవడం, మిల్లులకు చేర్చడం పెద్ద యజ్ఞంలా మారిందన్నారు. కోసిన పంటను వారాల తరబడి కల్లాలమీదే ఉంచుకుని కాపాడుకోవాల్సిన దుస్థితి ఎదురవుతోందన్నారు. చివరికి సరిపడు సంచుల సరఫరాలో ప్రభుత్వ వైఫల్యాన్ని తీవ్రంగా దుయ్యబట్టారు. ధాన్యం ఉత్పత్తిలో కూడా నిబంధనలు విధించి 60 సంచులకు మించి అవ్వకపోవడం, ఇచ్చే సంచులు చిరిగిపోయి నాణ్యత లేనివి ఇవ్వడం దారుణమన్నారు. పదేపదే సర్వర్లు మొరాయించడం, బోటింగ్ అయ్యాకే మిల్లులను కేటాయించడం, మిల్లులకు చేరాక తేమ శాతం పెరిగిపోయిందనే పేరుతో కోత విధించడం, కిరాయిలు పెరిగిపోవడంతో అసలు ధాన్యమే పండించకూడదనే దైన్యస్థితికి రైతులను నెడుతోందన్నారు. వాహనాల, హమాలీ ఛార్జీలు ధాన్యం కొనుగోలు డబ్బులతోపాటు ఇస్తామనడంతో ఈలోపు వడ్డీలకు అప్పులు తేవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం ఇస్తానన్న కిరాయి ఛార్జీలు కూడా వాస్తవ ఖర్చుకు సగం కూడా లేవన్నారు. కొత్త కొనుగోలు విధానం రైతులపాలిట శాపంగా మారిందన్నారు. కౌలురైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉందన్నారు. ఒకపక్క పంటకు 15 నుండి 16 బస్తాల వరకూ కౌలు చెల్లించాల్సి ఉందని, మరోపక్క కొనుగోలు విధానం వల్ల పెరిగిన అదనపు పెట్టుబడులతో కౌలుదారులకు అప్పులే మిగులుతున్నాయన్నారు. యంత్రాలు పెరిగి కూలీలకు కూడా పనిలేక అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో వరి, గోధుమ, ఆహార పంటల ఉత్పత్తిని గణనీయంగా తగ్గించి కార్పొరేట్లకు అనుకూలంగా వాణిజ్యపంటలను పండించాలనే కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు విధానంలో ఈ మార్పులు తెచ్చిందన్నారు. పొమ్మనలేక పొగపెట్టిన చందంగా వరి పంటను పండించనీయకుండా నీరుగార్చడం కోసమే కొత్త నిబంధనలు, కొనుగోలు చేసిన వాటికి డబ్బులు వారాల తరబడి ఇవ్వకపోవడం ఇందులో భాగమేనన్నారు. రైతుల ఆదాయాలు రెట్టింపు చేయడం కోసమే మూడు నల్ల చట్టాలు తెచ్చానని మోడీ చెప్పుకొచ్చారని, దేశ రైతాంగం పోరాడి ఆ చట్టాలను రద్దు చేయించుకున్న విషయాన్ని గుర్తు చేశారు. నేడు జగన్ ప్రభుత్వం చెప్పే మాటలు, చేసే చేతలు దీనికి కొనసాగింపుగానే ఉన్నాయన్నారు. ధాన్యం కొనుగోలు విధానాన్ని వ్యతిరేకించే టిడిపి, జనసేన, తదితర ప్రతిపక్షాలు జగన్ ప్రభుత్వ విధానాన్ని మాత్రమే విమర్శిస్తే సరిపోదన్నారు. దీనికి వెనుకున్న బిజెపి ప్రభుత్వ విధానాన్ని కూడా ఎండగట్టాలని వారిని కోరారు. నిజంగా రైతాంగం పట్ల ప్రేమ ఉంటే జగన్ ప్రభుత్వం తక్షణం ప్రస్తుతం ఉన్న నిబంధనలను రద్దు చేసి కల్లాలపైనే ధాన్యాన్ని కొనుగోలు చేసే ప్రక్రియను చేపట్టాలని కోరారు. సరిపడు సంచులు, వాహనాల కిరాయి, హమాలీ ఛార్జీలు ముందుగానే ఇవ్వాలన్నారు. భారీ నిర్మాణ సంస్థలకు ముందుగా మొబిలిటీ అడ్వాన్సులు ఇచ్చినట్లుగానే రైతులకు కూడా ముందుకు అడ్వాన్సులిచ్చి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.కిషోర్ పాల్గొన్నారు.

కార్మిక హక్కులను హరిస్తున్న బిజెపి

సిఐటియు రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.ఎ.గఫూర్

ప్రజాశక్తి - తణుకురూరల్



మాట్లాడుతున్న ఎం.ఎ.గఫూర్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చట్టాల్లో మార్పులు, సవరణలు చేస్తూ కార్మికుల హక్కులను హరిస్తోందని మాజీ ఎమ్మెల్యే, సిఐటియు రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.ఎ.గఫూర్ అన్నారు. వచ్చేనెల రెండు, మూడు, నాలుగు తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరగనున్న సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ సందర్భంగా గురువారం తణుకులోని ఎన్‌జిఒ హోమ్‌లో 'కార్మిక చట్టాలు-ప్రభుత్వాల వైఖరి' అంశంపై సిఐటియు నేత పి.దక్షిణామూర్తి అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన గఫూర్ ప్రసంగించారు. బిజెపి ప్రభుత్వం అధికార బలంతో చట్టాలను ఇష్టానుసారంగా మార్చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో 29 చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చారన్నారు. కార్మికుల హక్కులను హరించే ఆలోచనతోనే చట్టాలలో మార్పులు చేశార న్నారు. ప్రపంచంలో భారతదేశంలోనే చట్టాలు కఠినంగా ఉన్నాయని, కార్మికులకు అనేక హక్కులను కల్పిస్తున్నాయని, ఏదైనా ఫ్యాక్టరీ యాజమాన్యం ఎవరినైనా తొలగించాలంటే వీలులేని పరిస్థితి చట్టాల వల్ల ఉందని, అంతేకాక కొన్ని చట్టాల వల్ల విదేశీ పెట్టుబడి వచ్చే వీలులేదని, ప్రపంచంలోని ధనవంతులు భారతదేశంలో పెట్టుబడులు పెట్టడానికి, పరిశ్రమలు పెట్టడానికి భయపడుతున్నారని, ఈ చట్టాల్లో మార్పు తీసుకువస్తేనే వారంతా ఇండియాలో పెట్టుబడులు పెడతారని మోడీ చెప్పడం అవివేకమన్నారు. అంతేకాక దేశభక్తి ఉంటే హక్కులను కోల్పోవాల్సి వస్తుందని చెప్పడం దారుణమన్నారు. పెట్టుబడులు రాకపోతే దేశం అభివృద్ధి కాదని, దేశం అభివృద్ధి కావాలంటే కార్మికులు స్వతహాగా బానిసలుగా మారాలనే చేతకానితనంతో ప్రధాని నరేంద్ర మోడీ ముందుకుసాగుతున్నారని విమర్శిం చారు. ఎన్నికల సందర్భంగా ఏడాదికి రెండు కోట్లు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని, అధికారం చేపట్టిన తర్వాత ఇప్పటి వరకూ ఎన్ని కోట్ల ఉద్యోగాలిచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. మోడీ హామీలన్నీ బోగస్ అని, ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వని పరిస్థితి ఉందన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా దేశంలో నిరుద్యోగం ఉందన్నారు. రాష్ట్రంలో సిఎం జగన్ కార్మికుల వేతనాలు పెంచే ఆలోచన చేయకపోవడం దారుణమన్నారు. అందుకే రానున్న రోజుల్లో కార్మికులు, ఉద్యోగులు ఐక్యంగా పోరాటాలు చేయాలని, హక్కులను సాధించుకోవాలని పిలుపు నిచ్చారు. సిఐటియు 16వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, ఉపాధ్యక్షులు పిఎల్.నరసింహారావు, జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, శ్రామిక మహిళా నాయకురాలు అడ్డగర్ల అజయకుమారి, గార రంగారావు, గుబ్బల గోపి, నీలాపు ఆదినారాయణబాబు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు 18న స్క్రీనింగ్ టెస్టు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అంబేద్కర్ ఇండియన్ మిషన్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. సిఐడి రాష్ట్ర అడిషనల్ డిజిపి పివి.సునీల్‌కుమార్ నేతృత్వంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారని నియోజకవర్గ బాధ్యులు చోడే అనిల్, పొట్ల మహేష్ తెలిపారు. ఈ నెల 18న మండలంలోని నారాయణపురం గీతాంజలి కాలేజీలో స్క్రీనింగ్ టెస్టు నిర్వహించనున్నామని, నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్లాప్‌పై అవగాహన కార్యక్రమాలు

ఎంహెచ్‌ఒ డాక్టర్ మాలతి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

నగరపాలక సంస్థ పరిధిలో క్లీన్‌ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంహెచ్‌ఒ డాక్టర్ మాలతి తెలిపారు. నగరంలోని పలు డివిజన్లలో గురువారం పారిశుధ్య విభాగం అధికారులు సిబ్బంది క్లాప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంహెచ్‌ఒ మాలతి మాట్లాడుతూ కమిషనర్ షేక్ షాహిద్ ఆదేశాల ప్రకారం ఇన్‌ఫర్మేషన్, ఎడ్యుకేషన్ కమ్యూనికేషన్ కార్యక్రమాల ద్వారా స్వచ్ఛ ఏలూరు కార్యక్రమం చేపట్టామన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో ప్రతి ఇంటికి చెత్త నిర్వహణకు మూడు రంగులు కలిగిన డబ్బా లను అందిస్తున్నామన్నారు. కార్యక్రమం లో భాగంగా పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బంది చెత్త నిర్వహణపై ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు సుబ్బారావు, బట్టు ఏడుకొండలు, స్టీఫెన్ రాజ్, మహేంద్ర, సంజయ్, శేఖర్ సాంబశివరావు పాల్గొన్నారు.



విద్యార్థినికి ఎన్‌ఆర్‌ఐ తరపున సైకిల్ అందిస్తున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు లింగరాజు

విద్యాభివృద్ధికి లింగరాజు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - భీమడోలు

దేశ భవిష్యత్తు నిర్మాణంలో కీలక పాత్ర వహించే బాలిక విద్యాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు సేవలు అభినందనీయమని భీమడోలు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు టి.పుష్పావతి తెలిపారు. బాలికా విద్యాభివృద్ధి లక్ష్యంగా లింగరాజు అమెరికా దేశానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ తన బంధువు ఎం.లెనిన్ బాబు సహకారంతో దూర ప్రాంతాల నుంచి భీమడోలు హైస్కూల్‌కు వచ్చే విద్యార్థినులకు సైకిళ్లను అందిస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటివరకు 57 సైకిళ్లు అందించారు. దీనిలో భాగంగా గురువారం పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో లింగంపాడు నుంచి భీమడోలు హైస్కూల్‌కు వచ్చే విద్యార్థినికి సైకిలు అందించారు. ఈ మేరకు సహకరించిన ఎన్‌ఆర్‌ఐ ఎం.లెనిన్ బాబును, ఆర్.లింగరాజును పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.


వంటావార్పు చేస్తున్న దళితులు

అసైన్డ్, సీలింగ్ భూములు పేదలకు పంచాలి

వ్యకాస ఆధ్వర్యాన వంటావార్పు

ప్రజాశక్తి - దెందులూరు

పేదలకు చెందిన అసైన్డ్, సీలింగ్, గయాళ భూములు పేదలకు పంచాలని కొరుతూ వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యాన స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద దళితులు గురువారం వంటావార్పు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ భూములు పేదలకు ఇవ్వాలని దళితులు గత ఆరు నెలలుగా భూముల కోసం పోరాడుతున్నప్పటికీ అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. 25 ఏళ్లుగా స్థానికేతర భూస్వాములు ఈ భూములను ఆక్రమంగా అనుభవిస్తున్నారని, వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేదలకు చెందిన భూములు పేదల సాగు చేసుకునేందుకు హక్కు పత్రాలు రెవెన్యూ శాఖ అధికారులు ఇవ్వాలని, పట్టాభివ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భూ పోరాట నాయకులు ఆనందరావు, జాన్ రాజు, సుబ్బలక్ష్మి, వెంకటరమణ, తేరేమ్మ, లలిత, వినోద్, నాగేంద్ర పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధికి 'మానవత' కృషి

ప్రజాశక్తి - భీమడోలు

గ్రంథాలయ అభివృద్ధికి సహకారం అందిస్తున్న స్వచ్ఛంద సంస్థ మానవత సేవలు అభినందనీయమని గ్రంథాలయ పాలకులు డిఎస్ఎ.అమర్‌నాథ్ తెలిపారు. గ్రంథాలయానికి వచ్చే నిరుద్యోగ యువత, పోటీ పరీక్షలకు హాజరయ్యే పలువురికి అవసరమైన రూ.ఐదు వేల విలువైన పోటీ పరీక్షల పుస్తకాలను గురువారం మానవత సంస్థ తరపున భీమడోలు శాఖ అధ్యక్షులు పచ్చా వెంకటేశ్వరరావు అందించారు. గ్రంథ పాలకులు అమర్ నాథ్ వీటిని స్వీకరించారు. పలువురు యువత తమ అవసరాలకు అనుగుణంగా పుస్తకాలను అందించిన మానవతా సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో భీమడోలు మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ పివి.కృష్ణారావుతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

21న భూ సాధన రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈ నెల 21వ తేదీన విజయవాడ మొగల్రాజపురం సిద్ధార్థ అకాడమీ ఆడిటోరియంలో భూ సాధన రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మామిళ్లపల్లి వసంతరావు, బండి వెంకటేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సదస్సులో వ్యవసాయ కార్మిక సంఘాలు, కమ్యూనిస్టు పార్టీ పోరాటాల ఫలితంగా భూసంస్కరణలు, అటవీ చట్టాలు అమలుకు సంబంధించి చర్చించి కార్యాచరణ రూపొందిస్తారని తెలిపారు.

69 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని పర్వతాపురం గ్రామంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 104 సిబ్బంది షుగర్, బిపి, జ్వరం, గ్యాస్ తదితర వ్యాధిగ్రస్తులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ క్యాంపులో 69 మందికి పైగా వ్యాధిగ్రస్తులు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో మెడికల్ ఆఫీసర్ ఎం.జ్యోతి, ఎంఎల్‌హెచ్ వి మంజుల, ఎఎన్ఎం మధురవాణి, ఆశా కార్యకర్తలు కె.రాధా, ఎం.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఉపాధి హామీ చట్టంలో పనులపై సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ కెఆర్ఎస్.కృష్ణప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన కొయ్యలగూడెంలో మాట్లాడారు. మండలంలోని ప్రతి గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 18వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ఆయా గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ నెల 27వ తేదీన మండల స్థాయిలో సమావేశం నిర్వహించి పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఇజిఎస్ ఎపిఒ కె.నాగేశ్వరరావు, ఎస్ఆర్‌పి టి.వెంటేశ్వరావు పాల్గొన్నారు.

పలుగ్రామాల్లో 'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బుట్టాయిగూడెం సచివాలయం-2 పరిధిలో తూర్పు రేగులకుంట, కంసాలికుంట గ్రామాల్లో గురువారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఎ తెల్లం బాలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తూర్పు రేగులకుంటలో రూ.27 లక్షలతో వాటర్ ట్యాంకు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి తెల్లం వెంకాయమ్మ, తహశీల్దార్ ఎస్ఎస్.శాంతి, ఎంపిడిఒ కె.వాణి, వైసిపి మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీ, సొసైటీ ప్రెసిడెంట్ ఆరేటి సత్యనారాయణ, ఎంపిపి కారం శాంతి, జెడ్‌పిటిసి సభ్యులు రామతులసి పాల్గొన్నారు.

ఆనంద్ మృతి తీరని లోటు : టిడిపి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

టిడిపి సీనియర్ కార్యకర్త దొండపాటి ఆనంద్ మృతి పార్టీకి తీరని లోటని తెలుగు యువత నాయకులు పారేపల్లి నరేష్ అన్నారు. మండలంలోని బయన్నగూడెం గ్రామానికి చెందిన దొండపాటి ఆనంద్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని తెలుగు యువత నాయకులు పారేపల్లి నరేష్ గురువారం పరామర్శించి రూ.నాలుగు వేల ఆర్థిక సాయం అందించారు.

18,19 తేదీల్లో మహిళా కబడ్డీ సెలెక్షన్లు

ఉంగుటూరు :ఆదికవి నన్నయ్య విశ్వ విద్యాలయం పరిధిలో మహిళా కబడ్డీ సెలెక్షన్ పోటీలు ఈ నెల 18,19 తేదీల్లో ఉంగుటూరు మండలం నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ టి.కాశీవిశ్వేశ్వరరావు పేర్కొన్నారు. ఈ పోటీల్లో విశ్వవిద్యాలయం పరిధిలో కళాశాలల నుంచి క్రీడా కారులు పాల్గొంటారన్నారు. ఇక్కడ ఎంపికైన జట్టు డిసెంబరు 21న చెన్నైలో ఎమైటీ యూనివర్శిటీలో జరిగే పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు సంబంధిత ధ్రువపత్రాలను పీడీ రాజామెర్సిన్‌బాబు 7989920667 సంప్రదించాలని తెలిపారు.

సీజ్డ్ వాహనాలకు వేలం

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ ఆవరణలో గురువారం సీజ్డ్ వాహనాలకు వేలం నిర్వహించినట్లు ఎస్ఇబి సూపరింటెండెంట్ అరుణ కుమారి తెలిపారు. ఈ వేలం ద్వారా రూ.7,00,932 ఆదాయం వచ్చిందని తెలిపారు.

నేరాలు - ఘోరాలు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

అనుమానాస్పద స్థితిలో ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన విక్రమ్‌సింగ్(23)కు తండ్రి గౌరీలాల్, భార్య, ఎనిమిది నెలల పాప ఉన్నారు. రెండు నెలల క్రితం వారు రంగుల వ్యాపారం చేసుకునేందుకు కొయ్యలగూడెం వచ్చి స్థానిక జంగారెడ్డిగూడెం రోడ్డులో షాపు అద్దెకు తీసుకుని వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 14వ తేదీ రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చి భోజనం చేసిన అనంతరం షాపు వద్దకు పడుకునేందుకు వెళ్లారు. గురువారం ఉదయం కుటుంబసభ్యులు షాపు వద్దకు వెళ్లి పిలిచినా పలకపోవడంతో షాపుకు లోపల తాళాలు వేసి ఉండడంతో తాళాలను పగలగొట్టి చూశారు. దీంతో విక్రమ్‌సింగ్ మృతి చెంది ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి మృతదేహాన్ని జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనుమనాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

త్యాగధనులు పొట్టి శ్రీరాములు

ప్రజాశక్తి - భీమడోలు

ఆంధ్ర రాష్ట్ర సాధనకు ప్రాణ త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు సేవలు ఆయనను ప్రజల గుండెల్లో అమర జీవిగా నిలిపాయని టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. గన్ని వీరాంజనేయులుతో పాటు పలువురు టిడిపి ప్రముఖులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కలిదిండి : పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని ప్రధాన సెంటర్‌లోని శ్రీ వరలక్ష్మి జ్యువలర్స్ ఆవరణలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి కైకలూరు నియోజకవర్గ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు పూర కళ్యాణి శ్రీధర్, ఎఎంసి మాజీ ఛైర్మన్ నీలపాల వెంకటేశ్వరరావు, ఆర్యవైశ్య సంఘం నాయకులు నార్నెడిమిల్లి బాబ్జి, బత్తుల హనుమంతరావు, నీలి వెంకటేశ్వరరావు, నూకల శ్యామలరావు గుప్తా, చక్కా జగన్ మోహనరావు, పవిలెల రాజు, ప్రకాశరావు, బత్తుల రఘురామ్, పూర ధనుష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

చాట్రాయి : మండలంలోని పోలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన పొట్టి శ్రీరాములు వర్ధంతి సభలో పాఠశాల గణిత ఉపాధ్యాయులు ఎస్.నిరీమా మాట్లాడుతూ తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని పొట్టి శ్రీరాములు 1952 అక్టోబర్ ఒకటో తేదీన ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించి డిసెంబర్ 15వ తేదీన కన్నుమూశారన్నారు. పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగ ఫలితంగా రాష్ట్రం ఏర్పడిందన్నారు. అనంతరం విద్యార్థులు గాంధీజీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పి.రత్తయ్య, సిహెచ్.రాజేశ్వరి, రాణి పాల్గొన్నారు.

నూజివీడు : ఆంధ్ర రాష్ట్ర సాధనలో పొట్టి శ్రీరాములు కృషి అనుకరణీయమని, యువత ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని టిడిపి నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు కోరారు. గురువారం నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి సభను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు మలిశెట్టి జగదీష్, పట్టణ ప్రధాన కార్యదర్శి పల్లి నాగరాజు పాల్గొన్నారు.

చింతలపూడి : చింతలపూడిలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం టిడిపి పట్టణ అధ్యక్షులు పక్కాల వెంకటేశ్వరరావు, ప్ర ధాన కార్యదర్శి బోడా నాగభూషణం ఆధ్వ ర్యంలో నిర్వ హించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆశయాన్ని జగన్‌మోహన్‌రెడ్డి నేడు తుంగలో తొక్కుతూ రాష్ట్ర అభివృద్ధిని ప్రశ్నార్థకం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు కార్యదర్శి కొత్తపూడి శేషగిరిరావు, సీనియర్ నాయకులు తాటి అప్పారావు, టౌన్ ఉపాధ్యక్షులు మన్యం సత్తిబాబు, పొదిలి రాయప్ప, టౌన్ తెలుగుయువత అధ్యక్షులు నత్తా రవి, బిసి సెల్ అధ్యక్షులు గంగాధర్, ఎస్‌సి సెల్ నాయకులు గంధం ఏసుపాదం, గంటా నాగభూషణం పాల్గొన్నారు.


కలిదిండిలో...

కొయ్యలగూడెం : కొయ్యలగూడెంలో టిడిపి పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బొరగం శ్రీనివాసులు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు జీవితం అందరికీ ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పారేపల్లి రామారావు, పార్టీ మండల ఉపాధ్యక్షులు నిమ్మగడ్డ రవీంద్రనాథ్, మండల ప్రధాన కార్యదర్శి కర్రి రాంబాబు, పార్టీ టౌన్ అధ్యక్షులు రామకృష్ణ పాల్గొన్నారు. కన్నాపురం గ్రామంలో వాసవి ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

గణపవరం : గణపవరం డిగ్రీ కాలేజీలో గురువారం పొట్టి శ్రీరాములు వర్ధంతిని ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీరాముల విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు పి.అక్కిరాజు, జి.వెంకట్రావు ఎన్‌విఎస్ బిసి శ్రీనివాసరావు, డివివి.సత్యనారాయణ పాల్గొన్నారు.

మహారాజశ్రీ కొవ్వూరు 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. No. 605/2022
O.S. No. 248/2022

బిట్వీన్:
వాది (పిటీషనరు):
శ్రీ గంట శివరామకృష్ణ
ప్రతివాది (రెస్పాండెంటు):
శ్రీ రేలంగి హరి నారాయణ
టు: రెస్పాండెంటు/ప్రతివాది:
శ్రీ రేలంగి హరినారాయణ, తండ్రి: వెంకట సత్యనారాయణ, డోరు నెంబరు: 3-95ఎ, సా॥ నూతనగూడెం, పోలవరం, పోలవరం మండలం, ఏలూరు జిల్లా.

పై నెంబరు ప్రామిసరీ నోటు దావా O.S. No. 248/2022 లోనూ మరియు జప్తు పిటిషను I.A. No. 605/202 లోనూ దావా సమన్లు మరియు జప్తు నోటీసులు, సెక్యూరిటీ నోటీసులు మీకు ఎన్ని పర్యాయములు Batta కట్టిననూ మీరు బుద్ధిపూర్వకంగా తీసుకొనకుండా Avoid చేయుచున్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం యీ పేపరు ప్రకటన ఇవ్వబడినది. కాబట్టి ది. 26-12-2022వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥ల లగాయతు మీరు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరయి, మీ ఆక్షేపణలు తెలియజేసుకోవలయును. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

వాయిదా: 26-12-2022

పల్లి వెంకట నాగ మునేశ్వరరావు
కొవ్వూరు న్యాయవాది, కొవ్వూరు
ది.15-12-2022 తూ॥గో॥జిల్లా

గురజ ఛానల్‌కు షట్టర్ ఏర్పాటుకు చర్యలు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని గురజ ఛానల్‌కు షట్టర్ మెకానిజం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని పోల్‌రాజ్ ముదినేపల్లి సెక్షన్ ఎఇఇ విజెవి.కిషోర్ తెలిపారు. నీట మునిగిన వరిచేలు..ఆందోళనలో రైతులు శీర్షికతో ప్రజాశక్తిలో వచ్చిన వార్తకు స్పందించిన జలవనరులశాఖ అధికారులు త్వరలో షట్టర్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గుర్తు తెలియని ఆక్వా రైతులు రాత్రివేళ ఛానల్ స్లూయిస్ తాత్కాలిక అడ్డుకట్టని తెరచి ప్రధాన కాల్వలోని నీటిని ఛానల్ ద్వారా చెరువులకు తీసుకువెళ్లడంతో వరిచేలు నీట ముగిగాయన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా త్వరితగతిన షట్టర్ మెకానిజం ఏర్పాటు చేస్తామని తెలిపారు.

వారధి ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థినికి సైకిల్ అందజేత

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పేద విద్యార్థులను ప్రోత్సహిస్తున్న వారధి ట్రస్టు సేవలు అభినందనీయమని స్థానిక ఎస్ఐ సాగర్‌బాబు అన్నారు. స్థానిక నాలుగో వార్డు ఇందిరానగర్ కాలనీ ఎంపిపి పాఠశాల ప్రాంగణంలో వారధి ట్రస్ట్ వ్యవస్థాపకులు వలవల తాతాజీ, దాతలు వాశంశెట్టి ప్రసాద్ వితరణతో ప్రభుత్వ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థిని ముప్పిడి కుసుమకు సైకిల్‌ను అందించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సాగర్‌బాబు మాట్లాడుతూ ఇందిరానగర్ కాలనీ నుంచి ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే 18 మంది బాలికలకు సైకిళ్లు అందించాలన్న వలవల తాతాజీ ఆలోచనకు కార్యరూపం అందించిన దాతల దాతృత్వం గొప్పదన్నారు. అనంతరం ఎస్ఐ సాగర్‌బాబు చేతుల మీదుగా ముప్పిడి కుసుమకు సైకిల్ అందించారు. అనంతరం వలవల తాతాజీ మాట్లాడు తూ 18 సైకిళ్లు పంపిణీ చేయాలనే లక్ష్యంలో భాగంగా గురువారం రెండో సైకిల్‌ను అందించామని, ఫిబ్రవరి తొమ్మిది శ్రీఅభయాంజనేయ స్వామి వార్షికోత్సవం లోపు 18 సైకిళ్లు దాతల తోడ్పాటుతో అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెఎల్ఎన్.ధనకుమార్, మద్దిపాటి శ్రీను, షేక్ మస్తాన్, తుమ్మల శివ, ఉపాధ్యాయులు ఎం.శ్యామల, వి.రమాదేవి, ఎ.విజయ్, పి.నాగమణి, పి.ఇందిర, ఎం.కాంతమ్మ, వీరలక్ష్మి పాల్గొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో గొల్లపల్లి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - నూజివీడు

మండలంలోని గొల్లపల్లి గ్రామంలోని శ్రీ అన్నేరామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రతిభ కనబరచి మండల స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. గురువారం నిర్వహించిన సైన్స్ ప్రదర్శనలో మంకీగన్‌ని రూపొందించి ప్రదర్శించడం ద్వారా ప్రథమ స్థానం సాధించి తద్వారా డివిజన్ స్థాయి పోటీలకు అర్హత సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రాధికారాణి తెలిపారు. ఈ ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు బి.శ్రావణ్ త్రివేద్, ఎన్.గణేష్ కుమార్‌లను, వారికి తర్ఫీదు ఇచ్చిన సైన్స్ ఉపాధ్యాయులు నాగిరెడ్డి, శివ నాగమణి, మనోహరంలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ ఛైర్మన్ పల్లగాని వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పద్మ, మల్లేశ్వరి, దుర్గారాణి, సౌజన్య, మోహన్‌రావు, ప్రవీణ్, నాన్ టీచింగ్ సిబ్బంది ధనలక్ష్మి, రవి, మరియమ్మ, నారాయణ పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధిలో వైసిపి విఫలం : టిడిపి


సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ముసునూరు

రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో వైసిపి విఫలమైందని టిడిపి ముసునూరు మండల అధ్యక్షులు దేవినేని ఢలరామ్ అన్నారు. మండలంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ముఖ్యంగా యువతకు ఉపాధి కల్పించే విషయంలో వైసిపి ప్రభుత్వం దారుణంగా విఫలమైందన్నారు. నూతనంగా కంపెనీలు రాలేదని, పాత కంపెనీలు కూడా రాష్ట్రం నుంచి తరలిపోతున్నాయన్నారు. సొసైటీ కేంద్రాల్లో సున్నా వడ్డీ అంటూ కొందరికి మాత్రమే ఇచ్చి అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారన్నారు. వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్లు పెట్టడం సరికాదన్నారు. యువతను డ్రగ్స్ మత్తులో ముంచి పైశాచిక ఆనందం పొందుతున్నా రన్నారు. రైస్‌బౌల్ ఇండియాగా ఉన్న రాష్ట్రాన్ని డ్రగ్స్ మాఫియా ఇండియాగా మార్చారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాకనాటి సీతారామ్, కేండేటి బాబి, తోట శ్రీనివాసరావు, గారపాటి నరిసింహరావు, మద్దాల జాను, పి.వీరాంజనేయులు, మానికల శ్రీను పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - చాట్రాయి

ధాన్యం రైతుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సిహెచ్.విశ్వనాథరావుకు గురువారం వినతిపత్రం అందించారు.

విద్యార్థులకు ఫైలేరియా రక్త పరీక్షలు

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పిప్పర కొత్తపల్లి వడ్డిగూడెంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గురువారం ఫైలేరియా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పిహెచ్‌సి డాక్టర్ పిహెచ్‌ఆర్ఎస్.సంతోష్‌నాయుడు 20 మంది విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఒ జి.వెలసినబాబు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

చిన్నారుల భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాడు నేడు పథకాన్ని ప్రవేశపెట్టారని ఎంపిపి గంజిమాల రామారావు అన్నారు. మండలంలోని దిప్పకాయలపాడులో రూ.16 లక్షల నాడునేడు నిధులతో నిర్మించే అంగన్‌వాడీ కేంద్రానికి ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సున్నం శాంతకుమారి, సిడిపిఒ స్వర్ణకుమారి, సూపరవైజర్ నయోమి రాణి

హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని సింగరాయపాలెం శ్రీసుబ్రహ్మణ్యేశ్వర ఆలయ హుండీని అధికారులు గురువారం లెక్కించారు. 62 రోజులకు ఆదాయంగా రూ.22,63,894 నగదు, ఒక గ్రాము బంగారం, వెండి కేజీ 900 గ్రాములు వచ్చాయని ఆలయ ఛైర్మన్ శొంఠి నాగరాజు తెలిపారు.

బకాయిలు విడుదల చేయాలని వినతి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

రాష్ట్రంలో డిగ్రీ టెక్నికల్ ఉన్నత చదువులు చదివే విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతిదీవెన బకాయిలను విడుదల చేయాలని, జిఒ 77 రద్దు చేయాలని కోరుతూ పిడిఎస్‌యు ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఉపాధ్యక్షులు బి.వినోద్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిమంది పేద విద్యార్థులు ఫీజు రియింబర్స్‌మెంట్ ద్వారా ఉన్నత విద్యను అభ్యసిస్తుంటే విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలను చెల్లించలేనటువంటి పరిస్థితుల్లో జగన్ ప్రభుత్వం ఉందన్నారు. జిఒ 77ను రద్దు చేయాలని, పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులందరికీ ఉన్నత చదువుల కోసం విద్యాదీవెన పథకాన్ని అమలు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న వసతి దీవెన బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు నాయకులు ఎస్.అశోక్, కె.సాయి, డి.నితిన్ విద్యార్థులు పాల్గొన్నారు.

పలుచోట్ల 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి- ఏలూరు అర్బన్

స్థానిక 35వ డివిజన్ గౌరీదేవీ ఆలయం వద్ద నుంచి గురువారం నిర్వహించిన టిడిపి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో టిడిపి ఏలూరు అసెంబ్లీ ఇన్‌ఛార్జి బడేటి చంటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజా సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు దాదాపు 14 అంశాల్లో ప్రజాభిప్రాయాలను తీసుకున్నారు. వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారమయ్యేంతవరకు పోరాడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌ఛార్జి అలజంగి శ్రీనివాస్, క్లస్టర్ ఇన్‌ఛార్జి భౌరోతు బాలాజీ, నాయకులు కొల్లేపల్లి రాజు, తంగేటి మనోహర్, కాగాని సురేష్, ఈదుపల్లి దుర్గాప్రసాద్, శేషపు వెంకటేశ్వరరావు, ఆకుల రంగారావు, ఆకుల రమేష్, ధర రవి, చలమాల నాగు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: మండలంలోని రామనజపురంలో టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు ఎర్రమళ్ల రాజు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు పరిమి రాంబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు.

కైకలూరు రూరల్ : మండలంలోని కైకలూరు 120, 121 బూత్‌లలో గురువారం నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ జయమంగళ వెంకటరమణ పాల్గొన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకుని అనంతరం రచ్చబండ గ్రామసభ నిర్వహించారు.

బుట్టాయగూడెం :మండలంలోని బుట్టాయగూడెం టౌన్‌లో నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల వద్దకు వెళ్లి వారు వైసిపి హయాంలో ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని వాటిని నమోదు చేసుకున్నారు. ప్రజల తరుపున టిడిపి చేస్తున్న పోరాటానికి మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

మహారాజ శ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో భీమవరం
E.A.No.61/2022 in E.P.No.2/2017 in O.S.No.142/2013

Between
శ్రీమతి ఉద్దరాజు ఉష పిటీషనరు / 3rd Party Purchaser
మరియు
1. నడకుడిటి కనకదేశమ్మ - DHR cum Action Purchases
2. నాగిడి గోపాలరావు - JDR

To
1. నడకుడిటి కనక దేశమ్మ, W/o.: లేటు నర్శింహమూర్తి, హిందూ, వయస్సు : 65 సం., ఆడ, Properties, చిన్న గొల్లపాలెం, కృత్తివెన్ను మండలం, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్
2. నాగిడి గోపాల రావు, S/o. : పరశురామయ్య, హిందూ, వయస్సు 57 సం., మగ, వ్యాపారం, జ్యోతి హాస్టల్ మిషన్ హైస్కూల్ ఎదురుగా, నర్సాపురం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్

పై నెంబరు Claim petition E.A.No.61/2022 in E.P. No.2/2017 in O.S.142/2013 లో మీకు సమన్లు పంపించినప్పటికి అందుకొనక కాలయాపన చేయుచున్నందున యీ ప్రకటన పూర్వకంగా శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు తెలియజేయునది ఏమనగా ది.20-01-2023 సం. తేదీన ఉదయం గం.10.30 ని.లకు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు స్వయంగా గాని, మీ న్యాయవాది ద్వారా గాని తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున మిమ్ములను తీర్మానించబడునని యిందుమూలంగా తెలియజేయడమైనది.

శ్రీ మొగల్ల వెంకట రమణారావు, B.Com., B.L.
తేది : 9-12-2022 అడ్వకేటు, భీమవరం
భీమవరం Mobile No.: 98491 33488

ప్రకటన
మహారాజ శ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, భీమవరం
E.A.No.32/2022 in E.P. No.42/2021 in E.A No.310/2018 in E.P No.48/2016 in O.S.No.144/2015

Between :
శ్రీమతి దాట్ల పార్వతి ... Claim Petitioner
మరియు
శ్రీ సామంతపూడి రామకృష్ణంరాజు And 4 Others ...రెస్పాండెట్లు

To,
1. కొత్తపల్లి నాగరాజు,తండ్రి: అప్పలరాజు, హిందూ, మగ, వయస్సు : 52 సం॥, వ్యాపారం, డోర్ నెం. 11-10, పెదలోగిల్లు, H/o. పాలకోడేరు, పాలకోడేరు మండలం, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్.
2. నంబూరి రవి కుమార్, తండ్రి : శ్రీనివాస రావు, హిందూ, మగ, వయస్సు 50 సం॥, డోర్ నెం.50-33/11/8, P&T కాలనీ, సీతమ్మధార, విశాఖపట్నం-530013.
3. కొత్తపల్లి రాహుల్ వర్మ, తండ్రి : నాగరాజు, హిందూ, మగ, వయస్సు, 27 సం॥, డోర్ నెం. 27-8-13/2, శ్రీరామపురం, భీమవరం-2, పశ్చిగోదావరి జిల్లా.

పై నెంబరు గ్రంధము Claim Petition E.A.No. 32/2022 in E.P. No.42/2021 in E.A No.310/2018 in E.P No.48/2016 in O.S.No. 144/2015 లో మీకు సమన్లు పంపించినప్పటికి అందుకొనక కాలయాపన చేయుచున్నందున యీ ప్రకటన పూర్వకంగా శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు తెలియచేయునది ఏమనగా ది.29.12.2022 సం॥ తేదిన ఉదయం 10.30 ని॥లకు శ్రీకోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు స్వయంగా గాని, మీ న్యాయవాది ద్వారా గాని తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున మిమ్ములను తీర్మానించబడునని యిందుమూలముగా తెలియజేయడమైనది.

స్థలం : భీమవరం శ్రీ మొగల్ల వెంకట రమణారావు, B.com.B.L.,
తేది : 15.12.2022 అడ్వకేట్, భీమవరం, Mobile : 98491 33488

ప్రకటన
మహారాజ శ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, భీమవరం
E.A.No.31/2022 in E.P. No.42/2021 in E.A No.310/2018 in E.P No.48/2016 in O.S.No.144/2015

Between :
శ్రీమతి దాట్ల పార్వతి ... Claim Petitioner
మరియు
శ్రీ సామంతపూడి రామకృష్ణంరాజు And 4 Others ...రెస్పాండెట్లు

To,
1. కొత్తపల్లి నాగరాజు,తండ్రి: అప్పలరాజు, హిందూ, మగ, వయస్సు : 52 సం॥, వ్యాపారం, డోర్ నెం. 11-10, పెదలోగిల్లు, H/o. పాలకోడేరు, పాలకోడేరు మండలం, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్.
2. నంబూరి రవి కుమార్, తండ్రి : శ్రీనివాస రావు, హిందూ, మగ, వయస్సు 50 సం॥, డోర్ నెం.50-33/11/8, P&T కాలనీ, సీతమ్మధార, విశాఖపట్నం-530013.
3. కొత్తపల్లి రాహుల్ వర్మ, తండ్రి : నాగరాజు, హిందూ, మగ, వయస్సు, 27 సం॥, డోర్ నెం. 27-8-13/2, శ్రీరామపురం, భీమవరం-2, పశ్చిగోదావరి జిల్లా.

పై నెంబరు గ్రంధము Claim Petition E.A.No. 31/2022 in E.P. No.42/2021 in E.A No.310/2018 in E.P No.48/2016 in O.S.No. 144/2015 లో మీకు సమన్లు పంపించినప్పటికి అందుకొనక కాలయాపన చేయుచున్నందున యీ ప్రకటన పూర్వకంగా శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు తెలియచేయునది ఏమనగా ది.29.12.2022 సం॥ తేదిన ఉదయం 10.30 ని॥లకు శ్రీకోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు స్వయంగా గాని, మీ న్యాయవాది ద్వారా గాని తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున మిమ్ములను తీర్మానించబడునని యిందుమూలముగా తెలియజేయడమైనది.

స్థలం : భీమవరం శ్రీ మొగల్ల వెంకట రమణారావు, B.com.B.L.,
తేది : 15.12.2022 అడ్వకేట్, భీమవరం, Mobile : 98491 33488

ఆక్రమణల తొలగింపునకు చర్యలు

ప్రజాశక్తి - నిడమర్రు

భువనపల్లిలో మురుగు బోదె వద్ద ఆక్రమణలను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు సిపిఎం నాయకుల ఆధ్వర్యంలో గురువారం సర్వే నిర్వహించారు. మురుగునీరు వెళ్లడానికి అదనంగా తూరలు పెట్టి మరొక కల్వర్టు కట్టేందుకు, రైతులు పొలాలకు నడిచి వెళ్లడానికి దారి హక్కును కల్పించనున్నట్లు తెలిపారు.

దస్తావేజు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, ఆకివీడు మండలం, ఆకివీడు గ్రామ కాపురస్తులు కోనేపల్లి బాల వెంకట మురళీధరరెడ్డి, S/o. కోనేపల్లి రమణారెడ్డి అనే నేను తెలియజేయునది ఏమనగా ది. 11-12-2022వ తేదీన నాకు చెందిన ఒరిజినల్ దస్తావేజు నెం. 2350/1999 జిరాక్స్ తీయించుకొను నిమిత్తం నా స్వగృహం నుంచి ఒక బ్యాగ్‌లో పెట్టుకొని ఆకివీడు సెంటర్‌కు వెళ్ళుచుండగా మార్గం మధ్యలో సదరు బ్యాగు పడిపోయినది. చుట్టుప్రక్కల వెతికినా దొరకలేదు. ఎవరికైనా దొరికినచో క్రింది చిరునామాకు అందచేయగలరు.

ఇట్లు: కోనేపల్లి బాల వెంకట మురళీధరరెడ్డి
S/o. కోనేపల్లి రమణారెడ్డి, ఆకివీడు, ప॥గో॥జిల్లా
సెల్: 9010246038

దస్తావేజులు పోయినవి

నా క్లయింటు పశ్చిమగోదావరి జిల్లా, తణుకు మండలం, దువ్వ గ్రామం, డో.నెం. 5-62/6, **ముత్యాల పోతురాజు గారి కుమారుడు మల్లిఖార్జునరావు** అను వారు నాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం తెలియజేయునది.

నా క్లయింటు దువ్వ గ్రామం R.S. No. 760/6, 760/7 లో 242 చ॥గ॥ స్థలము సజ్జాపురం S.R.O. లో రిజిష్టరు కాబడిన ఒరిజినల్ లింకు డాక్యుమెంట్స్ 1) తేది. 27-07-2009, **నెం. 2222/2009** దువ్వ గ్రామం ఇంటి వద్ద నుండి తణుకు జిరాక్సు తీసుకుని వస్తుండగా ది. 10-12-2022వ తేదీన పడిపోయినది. ఎంత వెతికినా కనిపించి యుండలేదు. కావన ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

పమ్మి వి.నాగ వీరభద్రుడు
అడ్వకేట్, తాడేపల్లిగూడెం, ప॥గో॥జిల్లా
సెల్: 7702311197

PUBLIC NOTICE

This Public Notice is given on the instructions of my client **Mutyala Mallikarjuna Rao, S/o. Poturaju** of Duvva Village, D.No. 5-62/6, West Godavari District, Tanuku Mandal.

That my client having an extent of 242 sq.yards of site R.S. No. 760/6, 760/7 of Sajjapuram S.R.O., West Godavari District, A.P. There is a one original link document of above said property dated 27-07-2009, **Document No. 2222/2009**, were lost by my client while he was travelling from his house to Tanuku area, obtaining xerox opies on 10-12-2022. Therefore this public notice is issued to all that anybody that of the said original Documents they shall come forward with document proof within 7 days from the date of this notice to the under signed, else of shall be deemed that there are not claims (or) objections over the schedule property and the transaction will be proceeded with.

PAMMI V.NAGA VEERABHADRUDU
Advocate, Tadepalligudem, W.G.Dt.,
Cell: 7702311197

మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
H.M.O.P. 105/2021

Between:
పిటీషనర్: ఈశర్ల జయలక్ష్మి
రెస్పాండెంట్: ఈశర్ల నాగరాజు, S/o. సింహాచలం, హిందూ, వయస్సు 40 సం॥లు, మాసన్ వైవాక గ్రామం, ముదినేపల్లి మండలం, కృష్ణా జిల్లా (పాత జిల్లా), ఏలూరు జిల్లా (కొత్త జిల్లా)

పై నెంబరులో పిటీషనర్ రెస్పాండెంట్ అయిన మీకు మీయొక్క హాజరు నిమిత్తం నోటీసులు కోర్టు ద్వారాను, రిజిష్టర్డ్ పోస్టు ద్వారా ఎన్నిసార్లు పంపిననూ మీరు అందుకునియుండలేదు. అందువలన **దివి. 05-01-2023 సం॥ తేదీని ఉదయం గం॥ 10.30 ని॥ల** లగాయితూ పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేనిచో మీ పరోక్షమందు తీర్మానము చేయబడునని యిందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

చిట్టూరి పరాలరావు
భీమవరం పిటిషనర్ తరపున అడ్వకేట్
12-12-2022 భీమవరం

IN THE COURT OF HON'BLE SENIOR CIVIL JUDGE KAIKALUR
O.S.No.290/2018, I.A.No.136/2018 I.A.No.146/2022, I.A.No.147/2022 I.A.No.148/2022

Between:
Kuriseti Ravi Kishore ...Petitioner/Plaintiff
AND
1.Panthagani Swamy(Died).
2.Panthagani Sunitha.
3.Panthagani Venkata Rao.
4.Panthagani Daniel.
5.Panthagani Raju.
6.Panthagani Ramana.
...Respondents/Defendants

To,
R-3.Panthagani Venkata Rao, S/o.Late Swamy, Hindu, Cultivation, aged 46 years, R/o. Alluru Village of Mudinepalli Mandal, Eluru District, Kaikalur JCJC.,
R-4.Panthagani Daniel, S/o.Late Swamy, Hindu, Cultivation, aged 46 years, R/o. Alluru Village of Mudinepalli Mandal, Eluru District, Kaikalur JCJC.,

పై నెంబరు దావాలో చూపిన 1వ ప్రతివాది స్థానే అతని లీగల్ వారసులుగా 2 టూ 6 రెస్పాండెంట్లుగా చేర్చు పిటిషన్‌లో 3వ & 4వ రెస్పాండెంట్లకు శ్రీ కోర్టువారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ 3వ & 4వ రెస్పాండెంట్లు నోటీసులు తీసుకునివుండలేదు. కాబట్టి పై నెంబరు దావా గురించి 3వ & 4వ రెస్పాండెంట్లకు ఎటువంటి ఆక్షేపణలు ఉన్ననూ పై కోర్టువారి ఎదుట ది. 29-12-2022వ తేదీన ఉదయం గం॥ 10-30 ని॥లకు స్వయంగా గానీ, ప్లీడరు గారి ద్వారా గానీ, హాజరు అయి తెల్పుకొనవలెను. లేని ఎడల మీ పరోక్షమున దావా తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం)
వాయిదా తేది:29-12-2022.

(శీ అడివి వెంకట రమణ,
అడ్వకేట్, కైకలూరు,
(పిటీషనరు/వాది తరుపు న్యాయవాది)
సెల్ నెం.9441176997